క్లుప్తంగా

సెల్ టవర్ నిర్మాణానికి అనుమతించొద్దు

ప్రొద్దుటూరు : తమ వార్డు పరిధిలో సెల్ టవర్ నిర్మాణానికి అనుమతి మంజూరు చేయొద్దని 25వ వార్డు కౌన్సిలర్ షేక్ మెహనూర్ ఖాద్రి, వార్డు ఇన్‌చార్జి నూరి, వార్డు ప్రజలు సోమవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యను కలిసి వినతిపత్రమిచ్చారు. ప్రజలు నివసిస్తున్న ఇళ్ల మధ్యలో టవర్ నిర్మిస్తే రేడియేషన్ ప్రభావం కారణంగా ఇబ్బందులు పడుతామని అన్నారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డికి విన్నవించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

గేట్ పరీక్షలో పోరుమామిళ్ల విద్యార్థికి 337వ ర్యాంక్


విఘ్నేశ్వరరాజు

పోరుమామిళ్ల : మండలంలోని రామేశ్వరం గ్రామానికి చెందిన ఓంకారం విఘ్నేశ్వర రాజు ఇంజినీరింగ్ విభాగం గేట్‌లో ఆల్ ఇండియా 337వ ర్యాంక్ సాధించాడు. పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న విఘ్నేశ్వరరాజు ఉత్తమ ర్యాంక్ సాధించడంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి బడి పిల్లలకు రాగి జావ

మైదుకూరు : మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం నుంచి రాగి జావను అందించనున్నారు. మండలంలోని 96 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉదయం 8.15 గంటలకు ఒక్కొక్కరికి 150 మిల్లీలీటర్ల రాగిజావను పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ పద్మలత తెలిపారు. విద్యార్థులకు సోమ, బుధ, శుక్రవారాల్లో చిక్కీలు ఇస్తారని, మంగళ, గురు, శనివారాల్లో రాగి జావను అందిస్తామని ఎంఈఓ వివరించారు.

కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శిగా పీరయ్య


పీరయ్యకు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన దంతిక పీరయ్య కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శశిభూషణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉట్టి శ్రీనివాసులు ఆయనకు నియామకపత్రం అందచేశారు. ఉన్నత విద్యావంతుడు పీరయ్య సంస్థ కార్యక్రమాల్లో రెండు సంవత్సరాలుగా చురుగ్గా పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

రేపు పంచాంగ పఠనం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదిన సందర్భంగా సాయంత్రం 5 గంటలకు పంచాంగ పఠనం ఉంటుందని ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాం మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. జ్యోతిష భాస్కర గడ్డమణుగు తేజస్వీశర్మ పంచాగ పఠనం చేస్తారని, గాయకులు సాయిచరణ్, లలితలచే భక్తిసంగీత విభావరి ఉంటుందని, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

సీపీఐ నిరసన


పుట్టపర్తి సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం పుట్టపర్తి సర్కిల్‌లో నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ జీఓ నంబర్ 1ని రద్దు చేయాలని సీపీఐ నేతృత్వంలో అఖిల పక్షం చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. ప్రభుత్వం సీపీఐ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ పోలీసులచే అరెస్టులు చేయించిందన్నారు. ముందస్తు అరెస్టులతో ప్రజా గొంతుకలను అణచివేతకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం మూడున్నరేళ్లుగా ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యురాలు బషీరున్నీసా, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, నాయకులు దేవరశెట్టి నరసింహా, యేసోబ్, మద్దిలేటి, చంద్రశేఖర్, హరి, దౌలా, సుధాకర్, ప్రతాప్, ప్రమీల పాల్గొన్నారు.

వార్డులో కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

ప్రొద్దుటూరు క్రైం : ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణంలోని 25వ వార్డులో పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరిఫుల్లా, డీసీసీ కార్యదర్శి సాంబశివుడుతో పాటు ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ పాల్గొన్నారు. కాంగ్రెస్‌తోనే దేశంలో సుపరిపాలన సాధ్యమవుతుందని వారు తెలిపారు.

నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి వైద్యులు అంకుల్, సబిత, సిబ్బంది


చాపాడు: విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ అంకుల్ తెలిపారు. వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి నుంచి యర్రగుంట్ల రోడ్డు సర్కిల్ వరకు ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ నోటిని పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు వచ్చే అవకాశం ఉండదని తెలిపారు. అనంతరం నడింపల్లెలోని మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు టూత్ బ్రష్, పేస్ట్ పంపిణీ చేశారు. వైద్యులు సబిత, అనూష, ల్యాబ్ టెక్నీషియన్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి

చాపాడు : విద్యార్థులు చిన్న నాటి నుంచే దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దంత వైద్య నిపుణులు మహబూబ్ బాషా పేర్కొన్నారు. ప్రపంచ ఓరల్ హెల్త్ డే సందర్భంగా మండలంలోని లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాలలో హెడ్ టీచర్ జవహర్ మున్నీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంత పరీక్షలు చేసిన వైద్యులు దంతాలను శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు బ్రష్, పేస్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ప్రభావతి, సీఆర్పీ అంజనాదేవి పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల నిరసన



నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ, అంగన్‌వాడీలు

పోరుమామిళ్ల : స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వారి సమస్యల పరిష్కారం కోసం విజయవాడకు వెళుతుండగా దారిలో అడ్డుకొని పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లడం, ధర్నా చేయడం వారి హక్కు అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ. 26 వేలకు వేతనం పెంచాలని, పదోన్నతులు ఇవ్వాలని, బిల్లులు పెంచాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నేతలు జ్యోతమ్మ, రేణుకాదేవి, రమణమ్మ, స్వాతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ధర్నా


కొత్తపల్లె పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఐద్వా నాయకులు

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్, ప్రొద్దుటూరు కార్యదర్శి వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ అమృత్ నగర్‌లోని కొన్ని వీధుల్లో కొళాయిల ద్వారా మురికి నీరు వస్తోందన్నారు. మరికొన్ని చోట్ల మంచినీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అడ్డరోడ్లు వేయకపోవడంతో రెండు అడుగుల నీరు నిలిచి ఇళ్లోకి వస్తోందని తెలిపారు. సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, శేఖర్, ఐద్వా నాయకులు రాములమ్మ, శారద, శశిరేఖ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

గోపవరం : వివిధ సమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజ పేర్కొన్నారు. సోమవారం బేతాయపల్లె, గోపవరం సచివాలయాలను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇంకా అర్హులై ఉండి అందని వారు ఉంటే వారి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి చిన్నగోపవరంలో సాగైన వరిపంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న బేతాయపల్లె రైతుభరోసా కేంద్రాన్ని పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు తెలిపారు. లబ్ధిదారులకు వైఎస్సార్ కాంత్రి పథకం ద్వారా రుణాలు ఇవ్వడం జరుగుతుందని, అవసరమైన వారు వెలుగు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. ఈయన వెంట ఏఓ అరవిందనాయక్, పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆక్రమణలు తొలగింపు


ఆక్రమణను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గోపవరం : నెల్లూరు – ముంబై జాతీయ రహదారి పక్కనే ఉన్న దశాబ్దాల నాటి గరుడయ్య సత్రం, రామాలయం, కుంటలను ఆక్రమించి కంచె వేస్తుండగా సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. గోపవరం రెవెన్యూ పొలం 144/2 సర్వేనెంబరులో బద్వేలు పట్టణానికి చెందిన అమరరాజారత్నం, తల్లంరామయ్యశెట్టి పేర్లతో 5 ఎకరాలు పట్టా భూమి ఉంది. ఈ భూమిలో దశాబ్దాల క్రితం సత్రం, రామాలయం, కుంట ఏర్పాటు చేసి ఉన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతంలో పట్టా భూములు, డీకేటీ భూములకు ఎక్కడా లేని గిరాకీ రావడంతో గతంలో పూర్వీకులు కట్టించిన సత్రాలు, ఆలయాలను సైతం వదలడం లేదు. ఇందులో భాగంగానే మూడు రోజుల క్రితం సత్రం, ఆలయం, కుంట చుట్టూ స్తంభాలు నాటి కంచె వేసేందుకు ప్రయత్నించగా తహసీల్దారు దామోదర్ రెడ్డి దృష్టికి రావడంతో వెంటనే జరుగుతున్న పనులను నిలుపుదల చేశారు. తిరిగి సోమవారం కూడా పనులు చేస్తుండగా తహసీల్దారు ఆదేశాల మేరకు ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, వీఆర్ఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది వెళ్లి వేసిన కంచెను ధ్వంసం చేశారు. ఆలయాలు, సత్రాలు, కుంటలను కబ్జా చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.

బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో రేపు ఉగాది వేడుకలు

బద్వేలు అర్బన్ : ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీన బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు కళాపీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగసానిసాంబశివారెడ్డి, బలపనూరుశంభుప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న ఈ ఉగాది వేడుకలకు ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, ఆర్టీఐ కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఆర్డీఓ ఆకులవెంకటరమణ, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరంప్రభాకర్‌రెడ్డిలతో పాటు విశిష్ట అతిథులుగా బద్వేలు, మైదుకూరు ఎమ్మెల్యేలు డాక్టర్ సుధ, శెట్టిపల్లిరఘురామిరెడ్డి, బద్వేలు మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ జీ.రమణమ్మ, ఆడా చైర్మన్ ఎస్.గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డిలు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. అలాగే సాహిత్యం విభాగంలో పుత్తాపుల్లారెడ్డి, సంగీత విభాగంలో పొత్తపికొండయ్య, సామాజిక సేవ విభాగంలో పాపిజెన్నిరామకృష్ణారెడ్డిలకు ఉగాది పురస్కారాలు అందజేయనున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో కళాపీఠం ఉపాధ్యక్షులు సి.వి.నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత లేకపోతే ఉపేక్షించేది లేదు

ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న విజయ్ ప్రతాప్‌రెడ్డి

బ్రహ్మంగారిమఠం : విద్యార్థులకు ప్రతి రోజూ పెట్టే ఆహారంలో నాణ్యత లేకపోతే ఉపేక్షించేది లేదని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు.

బ్రహ్మంగారిమఠంలోని బీ ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఫుడ్ కమిషన్ చైర్మన్ పాఠశాలను సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఫుడ్ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులకు భోజన విషయంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం ఫుడ్ కమిషన్ యొక్క బాధ్యతలు, విధానాలను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులకు ఆహార విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా 9490551117, 155235 నెంబర్లకు వాట్సప్ చేయచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

కాశినాయన : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల రికార్డులు పక్కాగా ఉండాలని జిల్లా గణాంక అధికారి జార్జి, ఉప గణాంక అధికారి జాకోబ్ పేర్కొన్నారు. సోమవారం నరసాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది రికార్డులను సక్రమంగా నమోదు చేయాలన్నారు. గర్భవతులు, చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకాల నమోదు, సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. కుటుంబ నియంత్రణ రికార్డులతో పాటు వారికి జననీ సురక్ష యోజన పథకం కింద ఇచ్చే రూ.వెయ్యి వారి అకౌంట్లలో జమ అయ్యాయా లేదా పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రశాంతి, ఆరోగ్య విస్తరణాధికారులు శ్రీనివాసులరెడ్డి, సుబ్బరాయుడు, పబ్లిక్ హెల్త్‌నర్సు శారద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు అధిక ప్రాధాన్యత

బి.కోడూరు : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు విద్యాసాగర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలైనా స్పందన కార్యక్రమంలో అర్జీల రూపంలో ఇచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అన్నిశాఖల అధికారులు ఒకేచోట స్పందనలో పాల్గొంటున్నందున ప్రజలకు సులభతరంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ, వీఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

నరేంద్ర శర్మకు సన్మానం


నరేంద్ర శర్మ దంపతులతోపాటు తల్లిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

చాపాడు : అల్లాడుపల్లె దేవస్థాన పండితుడు నరేంద్ర శర్మను సోమవారం ఆర్యవైశ్యులు సన్మానించారు. అల్లాడుపల్లెలోని ఆర్యవైశ్య సత్రంలో రాష్ట్ర ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షులు దొంతు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నైకు చెందిన వేదపండితుడు బ్రహ్మశ్రీ సత్యమూర్తి శ్రౌతి సమక్షంలో నరేంద్రశర్మను సతీసమేతంగా సన్మానించారు. అనంతరం ఆయన తల్లిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు చిన్మయా మిషన్ రచనా చైతన్య మాతాజీ, ఆలయ ఈఓ శ్రీనివాసులు, తెలుగు విద్వాన్ సాంబశివారెడ్డి, ఆలయ చైర్మన్ జీటీ వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ కిషోర్‌కుమార్ రెడ్డి, డా.రామమునిరెడ్డి, సుబ్బరాయుడు, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మన్‌కు ఆర్థిక సహాయం


విద్యుత్ సిబ్బందికి రూ.20 వేలు నగదును అందజేస్తున్న పంచాయతీ సెక్రటరీ శ్రీధర్‌కుమార్

కలసపాడు : మండలంలోని రాజుపాలెం సచివాలయ విద్యుత్ లైన్‌మన్ సురేష్ ఇటీవల రాజుపాలెం వద్ద విద్యుత్ మరమ్మతులు చేపడుతుండగా విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. రాయవేలూరులో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన లైన్‌మన్ సురేష్‌కు సోమవారం రాజుపాలెం పంచాయతీ సెక్రటరీ శ్రీధర్‌కుమార్, సచివాలయ సిబ్బంది రూ.20 వేలు విద్యుత్ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోవులకు గ్రాసం పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ కృష్ణాలయ గోశాలలో సోమవారం హీరో రాంచరణ్ జన్మదిన వారోత్సవాల సందర్భంగా మెగాస్టార్ పవర్‌స్టార్ ఫ్రెండ్స్ సేవాసమితి ఆధ్వర్యంలో గోపూజ చేశారు. గోవులకు చిరుధాన్యాలు, ఆకుకూరలు, బెల్లంపిండిలను తినిపించారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు రామారావు, జిలాన్‌బాషు, మణి, షనీఫ్, బాబూరావు, ఇమాం, మధు, నంద, శ్యామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం

• ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు, పుణ్య కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. పోరెడ్డి సుజాత జయంతి సందర్భంగా పోరెడ్డి సుజాత ఫౌండేషన్ చైర్మన్ నరసింహారెడ్డి సోమవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కుమారులు పోరెడ్డి సందీప్‌రెడ్డి, పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి, శ్రీశైలం ఆలయ పాలకమండలి సభ్యురాలు బాచం రామేశ్వరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే స్పందన


గోపవరం : అర్జీలు పరిశీలిస్తున్న అధికారులు

గోపవరం : సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు. అన్నిశాఖల అధికారులు ఒకేచోట స్పందన కార్యక్రమంలో పాల్గొంటున్నందున ఏ సమస్య అయినా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో చిన్న సమస్య వచ్చినా కడపకు వెళ్లి అర్జీలు ఇచ్చేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. స్పందన కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, ఎంఈఓ చెన్నయ్య, ఏఓ అరవిందనాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, పీఆర్ ఏఈ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రైవేటు ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, రిజిస్ట్రేషన్ చేయించుకోని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం ఈ నెల 31వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా గణాంక అధికారి జార్జి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్జీవో హోంలో డివిజన్ పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, యాజమాన్యంతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇకపై ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో జరిగే ప్రతి చికిత్సను తప్పనిసరిగా ఆన్‌లైన్ చేయడంతో పాటు ప్రసవాలు, మరణాలు ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, టి.బి. కేసులను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు రోడ్డు ప్రమాద వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. ప్రతి ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్ల రిపోర్టులకు సంబంధించిన రికార్డులు ఉంచుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి ప్రమీల, ఏఎస్ఓ జాకోబ్, వైద్యులు డాక్టర్ రాంప్రతాప్‌రెడ్డి, హరికిరణ్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్లు జనార్ధన్‌రావు, శ్రీరాములయ్య తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి రామాయణ సప్తాహం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీ శోభకృత్ ఉగాది సందర్భంగా రామాయణ సప్తాహంను నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మప్రచార పరిషత్ మాజీ సభ్యుడు విద్వాన్ డాక్టర్ మూలె రామమునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 23న శ్రీరామనవమి పండుగ ప్రాముఖ్యతపై పల్లాకృష్ణ, 24న శ్రీరాముడు ధర్మ స్వరూపుడు, 26న శ్రీ రామామణం- సేవాధర్మం, 29 శ్రీ రామాయణం- జాతికి సందేశం అనే అంశాలపై విద్వాన్ రామమునిరెడ్డి ఉపన్యాసం ఉంటుందని వివరించారు. 25న శ్రీ రామాయణం- సీతాచరిత్రపై డాక్టర్ బుర్రి సుబ్బరాయుడు, 28న శ్రీరామాయణం- రామరాజ్యం అనే అంశంపై సీవీ సుబ్బారెడ్డి ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. భక్తులు సప్తాహ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

■ అగస్త్యేశ్వరాలయంలో శ్రీ శోభకృత్ ఉగాది పర్వదిన సందర్భంగా 22వ తేదీ సాయంత్రం 4.30కు నంది అవార్డు గ్రహీత యడవల్లి రమణయ్య భాగవతార్‌తో భూ కైలాస్ హరికథా కాలక్షేపం, 6 గంటలకు బ్రహ్మశ్రీ మాడుగుల నాగేంద్ర శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం ఉంటుందని దేవాదాయ శాఖ ఏసీ శంకర బాలాజి తెలిపారు.

ప్రజల సమస్యలను పరిష్కరిస్తా


ప్రజలతో మాట్లాడుతున్న కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : కొత్తపల్లె పంచాయతీలోని ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యాలయం సభా భవనంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్ సమస్యలపై దృష్టి పెట్టామని.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ అన్నారు. టీచర్స్ కాలనీ ప్రజలు విద్యుత్ మోటార్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసినా ఫలితం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన సర్పంచ్ అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు.

మున్సిపల్ పార్కులకు అంబేడ్కర్, పూలే పేర్లు పెట్టాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మున్సిపాలిటి పరిధిలోని కందుల బాలనారాయణరెడ్డి కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కాలనీలలో నిర్మిస్తున్న మున్సిపల్ పార్కులకు భారత రత్న బీఆర్ అంబేడ్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే పేర్లు పెట్టాలని షెడ్యూల్డ్ కులాల, హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.చంద్రబాబు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటరమణయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ మున్సిపల్ పార్కులకు అంబేడ్కర్, పూలే పేర్లు పెట్టాలని 2018లో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఓబులేసు, శేఖర్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి


మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

రాజుపాళెం : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని టంగుటూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జరగబోవు పదో తరగతి పరీక్షలు బాగా రాసి, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. హెచ్ఎం శ్రీహరి మాట్లాడుతూ పరీక్షలంటే భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కేసీ పుల్లయ్య హెల్త్‌కేర్ సెంటర్ ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని కేసీ.పుల్లయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు కేసీ పుల్లయ్య 11వ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు కేసీపీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కె.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కేసీ పుల్లయ్య హెల్త్‌కేర్ సెంటర్ ప్రారంభోత్సవం, పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ, వివిధ రంగాల్లో సేవలందించిన నలుగురురికి కేసీ పుల్లయ్య స్మారణ జాతీయ పురస్కారాల ప్రధానోత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్పీ అన్బురాజన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని నిర్వాహకులు కె.అనిల్‌కుమార్, సుశీల్‌కుమార్ కోరారు.

రేపు ఉగాది కవి సమ్మేళనం

ప్రొద్దుటూరు : శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు కొనిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ప్రొద్దుటూరులోని తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కవి సమ్మేళనంలో పాల్గొనే వారు తమ పేర్లను బాల సాహితీవేత్త చదువులబాబుకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొనున్నట్లు వివరించారు.